

# హార్ట్ గేలరి

"రఘూ" పిలిచాను.

అతను గోడవైపు తిరిగి పడుకుని ఉన్నాడు. నిద్రపోతున్నట్టు అనిపించడం లేదు.

మళ్ళీ పిలిచాను. కదిలాడు కాని పలకలేదు.

ఆ అపార్టుమెంటుకు రావడం నాకు అదే మొదటిసారి. ఈమధ్యే కట్టినట్టుగా ఉ ంది. ఎవరూ రాలేదనుకుంటాను. చాలా ఫ్లాట్లకు తాళాలు వేసి ఉన్నాయి. మేం వచ్చిన ఫ్లాటుకు గృహప్రవేశం జరిగిందో లేదో? కొత్తగా మేం కాపరానికి వచ్చినట్టుగా

ఉంది. ఈసరికి మా పెళ్ళి అయిపోయి ఉండాలి. అవాంతరాలు అధిగమించడం తేలిక అనిపించలేదు.

అది మూడు గదుల ఫ్లాట్. ప్రతి గదిలోనూ పెద్ద కప్‌బోర్డులున్నాయి. ఫర్నీచరూ కొత్తదే. అన్నీ ఉన్నాయి. ఏ డబ్బు ఉన్న వ్యక్తిదో అయి ఉండాలి. అన్నిటికీ మించి ఆ ఇంట్లోని కర్టెన్లు నన్ను ఆకట్టుకున్నాయి. అటువంటివే మరో రంగులో ఎక్కడో చూశాను. ఎక్కడ చూశానో మనసుకు తట్టడంల్లేదు.

ఆ ఫ్లాటు ఎవరిదని రఘుని అడగలేదు. అతను చెప్పలేదు. ఏదయినా గుచ్చిగుచ్చి అడిగితే విసుక్కుంటాడు. చెప్పడు.

అతన్ని కదుపుతూ, "నిద్రపోయింది చాలు కాని, లే బాబూ" అన్నాను.

పక్కకు తిరిగాడు. అతను నాకంటే నాలుగు సంవత్సరాలు చిన్నవాడయినా కొన్నేళ్ళపాటు ఒకే ప్రాజెక్టులో పనిచేయడం వలన బాగా దగ్గరయ్యాం. ఒక సమయంలో నన్ను పెళ్ళి చేసుకోడానికి సిద్ధపడి రిజిస్ట్రార్ ఆఫీసు నుండి అప్లికేషన్ తెచ్చాడు. నేనే ధైర్యం చేయలేకపోయాను. నా అక్కయ్యలిద్దరి పెళ్ళిళ్ళు అయితే గాని నావంతు రాదు. మావాళ్ళు కాని వ్యక్తితో నా పెళ్ళి అయితే అక్కయ్యలకు సంబంధాలు తేలికగా రావు.

ప్రస్తుతం రఘు మా యూనిట్‌లో లేడు. బిలాస్‌పూర్ యూనిట్‌కు ప్రమోషన్ మీద బదిలీ చేశారు. మరో ప్రమోషన్ వస్తేగాని తిరిగి మా యూనిట్‌కు రాడు. అతను తిరిగి వస్తే మా పెళ్ళి కదులుతుంది. ఎంత త్వరపడుతున్నానో అంత వెనక్కి వెళ్ళిపోతోంది. అసలు అతనికి మా యూనిట్‌కు తిరిగి రావాలని ఉందో, లేదో అని అప్పుడప్పుడు అనుమానం కలుగుతుంటుంది. ఆఫీసు పని కల్పించుకుని రెండు మూడు నెలలకు ఒకసారయినా వచ్చివెళ్తుంటాడు. అతను ఇక్కడ ఉన్నన్ని రోజులూ కలుసుకుంటూ ఉంటాం.

రఘు కళ్ళు తెరిచి, "నిద్రపోనీయవు" అన్నాడు.

"నిద్రపోయింది చాలు, ఇహలే"

నా చున్నీని లుంగీలా చుట్టుకున్నాడు. తీసుకోవడం ఇబ్బందిగా ఉంది. గట్టిగా లాగితే చిరిగిపోతుంది. "చున్నీని తీసుకోనీయి..." అంటున్నాను.

నా చేయి అందుకుని తనమీదకు లాక్కుంటుంటే గోడ గడియారం వంక చూశాను. అరూ ఇరవై అయింది. ఇంటికి చేరుకునేసరికి ఎనిమిదిన్నర దాటుతుంది. అమ్మ ఇంటి బయటున్న మెట్లమీద కూర్చుని నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. నన్ను చూస్తేగాని ఆమె మనసు కుదుటపడదు. అక్కయ్యలు టీవీకే అతుక్కుపోయి ఉంటారు. రాత్రి పదకొండు దాటితేగాని అన్నయ్య ఇంటికి చేరుకోడు. నాన్న కోసం అమ్మ ఎదురుచూడదు. వస్తే వస్తాడు. లేనిపక్షంలో సికింద్రాబాద్‌లోనే ఉండిపోతాడు. నాన్న అమ్మను పెద్దగా పట్టించుకోడు.

ఇప్పటివరకు నాకు దగ్గరగా ఉండి అర్థం కాని వ్యక్తులు ఇద్దరు. ఒకరు నాన్న. మరొకరు రఘు.

"నేనింటికి వెళ్ళాలి రఘూ"

"పద్దా? రేపు నేను వెళ్ళిపోతున్నాను."

తల అడ్డంగా ఆడించాను. వద్దంటే తొందర పెట్టడు. నా చేయి వదిలాడు. మంచం దిగి, స్నానం చేసి అరగంటలో వెళ్ళిపోడానికి సిద్ధపడ్డాను.

మధ్యాహ్నం కాకముందు నుండి అతనితో ఉంటున్నా నా మనసులో శేఖర్ మెదులుతూనే ఉన్నాడు. నా కోసం మా ఆఫీసుకు ఫోన్ చేసి ఉంటాడు. మా రిసెప్షనిస్టు ఫాతిమా అతనికి తెలుసు. నేను సెలవుపెట్టిన విషయం ఆమె అతనికి చెప్పి ఉంటుంది. ఉదయం అతను ఫోన్ చేసినప్పుడు ఆఫీసుకు వెళ్తున్నాననే చెప్పాను. నా ఎడల అతను నిజాయితీగానే ఉంటాడు. రఘు బిలాస్‌పూర్ వెళ్ళకముందు నుండే శేఖర్‌తో నాకు పరిచయం ఏర్పడింది. రఘు విషయం చెప్పలేదు. శేఖర్‌కు ఎంత దూరంగా ఉందామని అనుకున్నానో అంత దగ్గరయ్యాను. నా ఒంటరితనమే అలా చేయించింది. ఏమీ తోచనప్పుడు అతనికి ఫోన్ చేసి మాట్లాడడం అలవాటయిపోయింది. మనసులో ఏమీ దాచుకోకుండా ప్రతి విషయం నాకు చెపుతుంటాడు.

నా విషయాలు అతనికి తెలియవు. చెప్పలేదు.

నేను రఘు అపార్ట్‌మెంటు నుండి బయటకు వచ్చి వాచ్‌మేన్‌కు ఇంటి తాళం చెవి ఇచ్చి అతని చేతిలో వందరూపాయలు నోటు పెట్టి రోడ్డు మీదకు వచ్చేసరికి ఏడున్నర అయింది. ఆటో పట్టుకుని అమీర్‌పేట సిటీబస్‌స్టాప్ వరకు వచ్చాం.

అక్కడినుండి నేను ఉండే కూకట్‌పల్లికి అయిదు నిమిషాలకో బస్సు దొరుకుతుంది. చీకటి మెల్లగా పరుచుకుంటోంది. రఘు మలక్‌పేట వైపు వెళ్ళాలి. అతనితో మరికొద్దిసేపు మాట్లాడాలనే ఉంది. త్వరగా ఇంటికి వెళ్ళిపోవాలని ఉంది. రఘుకు దగ్గరగా నుంచొని ఉన్నాను. నా చేయి అతని చేతిలో ఉంది. అతని చేయి ఇంకా వేడిగా ఉంది. మాటల్లో పడిపోయాం.

కొద్దిసేపయ్యాక ఎందుకో వెనక్కి తిరిగాను. కాళ్ళు ఒక్కసారిగా చల్లబడిపోయాయి. కొద్దిదూరంలో శేఖర్ తన మోటార్ బైకుకు ఆనుకుని నిలబడి మా వంక చూస్తోంటే నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. చేతులు చిన్నగా వణకడం మొదలెట్టాయి. ఒక్క క్షణమయినా అక్కడ నిలబడలేకపోయాను. రఘు చేయి వదిలి వెళ్తున్నానయినా చెప్పకుండా అప్పుడే వచ్చి వెంటనే కదలబోతున్న క్రిక్కిరిసిన బస్సులోకి ఎక్కబోతూ జారి పడబోయాను. ఎవరో నన్ను గట్టిగా పట్టుకుని బస్సులోకి లాగారు.

రఘుతో నాకు ఉన్న సాన్నిహిత్యం శేఖర్‌కు ఎప్పుడో చెప్పి ఉండవలసింది. చెపితే శేఖర్ నాకు ఎక్కడ దూరమయిపోతాడో అని భయపడ్డాను. ఆ సంఘటన జరిగాక శేఖర్ నాకు ఫోన్ చేయలేదు. అయాం సారీ అని మెసేజ్ పంపిద్దామనుకున్నాను. ధైర్యం చాలలేదు.

* * *

మూడు సంవత్సరాలు గడిచాయి. సంవత్సరంన్నర కిందట కంపెనీ నుండి పింకు కార్డు వచ్చాక మెహిదీపట్నంలోని ఒక ప్రభుత్వేతర సంస్థలో తక్కువ జీతానికి చేరేటప్పుడు శేఖర్ గుర్తు వచ్చాడు. అతను పలుకుబడి కలిగిన వ్యక్తి. అతను సహాయం చేస్తే నా అనుభవానికి తగిన మంచి ఉద్యోగమే దొరుకుతుంది. చేస్తాడో, లేదో? నాకు మొదటి ఉద్యోగం ఇప్పించింది అతనే. నాకే కాదు నాకు తెలిసిన నలుగురికి మంచి ఉద్యోగాలు ఇప్పించాడు. శేఖర్ రఘు అంత పిసినారి కాదు. నా కోసం బాగానే ఖర్చుపెట్టాడు. ఒకసారి నేను అతనికి .బంగారపు గొలుసు కొనిచ్చాను. మంచి ఉద్యోగం ఇప్పించమని అడగడానికి నాకు ముఖం చెల్లలేదు.

ఆ సాయంత్రం ఆఫీసునుండి త్వరగా బయటపడి లక్డికాపూల్ స్టేషన్‌కు వచ్చి ఎం.ఎం.టి.ఎస్. బండి కోసం ఎదురుచూస్తూ బెంచిమీద కూర్చున్నాను. అలా

కూర్చున్నానో లేదో నా పక్కనే ఎవరో కూర్చున్నారు. తలెత్తి చూశాను. శేఖర్. అతన్ని మళ్ళీ చూడగలనని ఊహించలేదు. అతనేం మారలేదు. మునుపటికన్నా బావున్నాడు.

"ఏమిటిలా అయిపోయావు?" అడిగాడు.

ఏమని చెప్పాలో తోచలేదు. చిన్నగా నవ్వాను. ఇన్నాళ్ళ తర్వాత అతన్ని చూడడం సంతోషంగా ఉంది. మాట్లాడటానికి మాటలు తడుముకోవలసి వస్తోంది.

"రఘుతో నీ పెళ్ళి అయిందా?" అడిగాడు.

రఘు అతనికి ఎలా తెలుసో నాకు అర్థం కాలేదు. తల అడ్డంగా ఆడించి, "రెండు సంవత్సరాల కిందట ఎవరినో చేసుకున్నాడని విన్నాను. పెళ్ళికి నన్ను పిలవలేదు" అన్నాను.

"ఇప్పుడతను ఎక్కడ ఉంటున్నాడు?" అడిగాడు.

"తెలియదు. తెలుసుకోవాలనిపించలేదు. రఘు నీకు ఎలా తెలుసు?"

"మేమిద్దరం కలిసి చదువుకున్నాం. మీ స్నేహం గురించి అతనికంటే ముందు నువ్వు చెప్పి ఉంటే బావుండేది. వెల్... ఇప్పుడేం హేంగోవర్లు లేవు. బేక్ టు నార్మల్... బీ హేపీ... ఆ రోజు, తర్వాత మీరు వెళ్ళిన ఆ ఇల్లు నాదే..." అంటూంటే హైదరాబాద్ వెళ్ళే బండి ఆగింది. అందులోంచి దిగిన ఓ అమ్మాయి అతన్ని చూసి చేయి ఎత్తి "హేయ్" అని మేం కూర్చున్నచోటికి వచ్చింది. ఆమె కోసమే అతను స్టేషన్‌కు వచ్చినట్టుంది. మనిషి బావుంది. అతను లేచి నిలబడి ముందుకు చాపిన ఆమె చేయి అందుకున్నాడు. ఆమెను నాకు పరిచయం చేయలేదు. ఆమె మెడలో నేను అతనికి ఇచ్చిన గొలుసు ఉంది.

"మళ్ళీ కలుద్దాం" అని ఆ అమ్మాయితో స్టేషన్ బయటకు వెళ్ళాడు. బయట పార్క్ చేసిన కార్లో కూర్చున్నారు. నిమిషం తర్వాత కదిలింది.

నేను వెళ్ళాల్సిన బండి వచ్చింది. ఎక్కాలనిపించలేదు. తర్వాత ఎన్నో బళ్ళు వచ్చాయి. మనసు ఖాళీ అయి కదలబుద్ధి కాలేదు. బెంచీకి అతుక్కుపోయినట్టు చాలాసేపటి వరకు అలానే ఉండిపోయాను.

*-ఆదివారం 'ఆంధ్రప్రభ', 14 సెప్టెంబర్, 2014*